

1,78,262 ఎకరాల్లో

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం



● విత్తనాలకోసం రైతుల ఎదురుచూపులు

చిత్తూరు సెంట్రల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు.ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా వాతావరణం సాగుకు అనుకూలంగా మారడంతో దుక్కి దున్ని నేలను సిద్ధం చేసుకునేందుకు రైతులు పనులు ప్రారంభించారు.జిల్లావ్యాప్తంగా 1,78,262 ఎకరాల్లో 22 రకాల పంటలు సాగు చేయనున్నారు. 88,095 ఎకరాల్లో వేరుశనగ సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.అయితే వేరుశనగ విత్తనాల కొరత రైతులకు ఇబ్బందికరంగా మారింది.విత్తనాలతో పాటు విత్తనశుద్ధి మందులు సబ్సిడీపై పంపిణీ చేయాల్సి ఉన్నా, ఇంకా వ్యవసాయ శాఖ అధికారులు ఖరీఫ్ ప్రణాళికలు సిద్ధం కావాలంటూ కాలయాపన చేస్తుండడంపై రైతుల్లో అసహనం వ్యక్తమవుతోంది.

22 రకాల పంటల సాగు

ఖరీఫ్‌లో ప్రధాన పంటగా చెప్పుకునే వేరుశనగ 88,095 ఎకరాల్లో , వరి 28,010 ఎకరాల్లో , సజ్జలు 220ఎకరాల్లో , జొన్నలు 1510ఎకరాల్లో , మొక్కజొన్న 1195ఎకరాల్లో , సామలు 437.5ఎకరాల్లో , రాగి 5922.5ఎకరాల్లో , కొర్రలు 30ఎకరాల్లో , కందులు 6412.5ఎకరాల్లో , ఉద్దిపప్పు (మినుములు) 250ఎకరాల్లో , ఉలవలు 4232.5ఎకరాల్లో , పెసలు 332.5ఎకరాల్లో , ఆవుగడ్డి 1160ఎకరాల్లో , అనుములు 1330ఎకరాల్లో , సీసమమ్ 12.5ఎకరాల్లో , పొద్దుతిరుగుడు 2.5ఎకరాల్లో , ఆముదం 5ఎకరాల్లో , పత్తి 27.5ఎకరాల్లో , చెరకు 18,732.5ఎకరాల్లో , గడ్డి 17,127.5 ఎకరాల్లో రైతులు సాగు చేయనున్నారు.

జాడ లేని విత్తనాల పంపిణీ

జిల్లావ్యాప్తంగా ఈ నెల 15న 502 రైతు భరోసా కేంద్రాల ద్వారా వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయాల్సి ఉండగా, ఆ ఊసే లేకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.88,095 ఎకరాల్లో వేరుశనగ సాగుకు 35 వేల క్వింటాళ్ల విత్తన కాయలు అవసరం కాగా, ఏపీ సీడ్స్ ద్వారా కే-6 రకం విత్తనాలు 30 వేల క్వింటాళ్ల సరఫరాకే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అందులోనూ ప్రస్తుతం 26,354 క్వింటాళ్ళు మాత్రమే సరఫరా చేయనున్నారు. ఇందులోనూ 25977 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు మాత్రమే డివిజన్లకు కేటాయించారు. చిత్తూరు డివిజన్‌కు 8540 క్వింటాళ్లు, నగరికి 2421 క్వింటాళ్లు, పుంగనూరుకు 7941 క్వింటాళ్లు, పలమనేరుకు 7075 క్వింటాళ్ళు కేటాయించారు. వీటితో పాటు పెసలు 37 క్వింటాళ్ళు, కందులు 323 క్వింటాళ్ళు, ఉలవలు 1720 క్వింటాళ్ళు, రాగి 280 క్వింటాళ్ళు, పచ్చరొట్టె 378 క్వింటాళ్లు, ఎండు జనపనార 1156 క్వింటాళ్ల విత్తనాలు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం 26,354 క్వింటాళ్ళ వేరుశనగ విత్తన కాయలతో పాటు మరో 13,984 విత్తన కాయల అవసరం వుందని, పెసలు 2639 క్వింటాళ్ళు కావాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు రాష్ట్రస్థాయి అధికారులకు తెలిపారు. సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీ సమయంలో రైతులకు విత్తన శుద్ధి మందునూ అందించాల్సి ఉండగా, వ్యవసాయ శాఖాధికారులు దీనిపై దృష్టి సారించలేదు. వాస్తవానికి జూన్ నెలకు పక్షం రోజుల ముందే రైతులకు వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేస్తే దుక్కి దున్నుకున్న రైతన్న జూన్ నెల మొదటి వారంలో విత్తనాలు వేయాల్సి ఉంది. అంతకు ముందు వాటిని శుద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది.

చాలీచాలని ఎరువులు

ఖరీఫ్ సీజన్‌లో 55 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, 40,320 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.యూరియా 26,793 మెట్రిక్ టన్నులు, డీఏపీ 3240 టన్నులు, ఎన్‌పీకే 8970 టన్నులు, ఎంఓపీ 453 టన్నులు, ఎంటీఎస్, ఎస్ఎస్‌పీ 864 టన్నులు అవసరమని జిల్లా వ్యవసాయశాఖాధికారులు ప్రణాళికలు సిద్ధం చేసినా, వీటిలో చాలా ఎరువులు ఇప్పటికీ అందుబాటులో లేకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆడుదాం ఆంధ్ర ఖర్చులపై విజిలెన్స్ ఆరా

గంగాధరనెల్లూరు, మే 24 (ఆంధ్రజ్యోతి):వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఖర్చులపై విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. అప్పటి క్రీడల శాఖ మంత్రి రోజా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాల, మండల , నియోజకవర్గ , జిల్లా ,రాష్ట్రస్థాయుల్లో ఆడుదాం ఆంధ్ర పేరిట క్రీడా పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే.అప్పట్లోనే నిధుల దుర్వినియోగమయ్యాయంటూ ప్రతిపక్షాలు ఆరోపించాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయిలో విచారణకు విజిలెన్స్ అధికారులను ఆదేశించింది.ఈ నేపథ్యంలో తిరుపతి విజిలెన్స్‌శాఖకు చెందిన అధికారులు ఆడుదాం ఆంధ్ర వివరాలు తెలపమంటూ మండల పరిషత్ అధికారులకు ఆన్‌లైన్‌లో ఓ ప్రొఫార్మా పంపారు.మొత్తం ఎన్ని నిధులు విడుదలయ్యాయి, ఏయే క్రీడల్లో పోటీలు నిర్వహించారు, ఎంతమంది క్రీడాకారులు హాజరయ్యారు,విజేతలకు ఏం అందజేశారు, క్రీడాకారులకు ఏమేం కిట్లు పంపిణీచేశారనే విషయాలపై వివరాలు కోరారు.గంగాధరనెల్లూరు ఎంపీడీవో సోమలరాజు సతీష్ నాలుగురోజుల క్రితం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లోకేష్‌కు ఈ వివరాలను సేకరించి తిరుపతి విజిలెన్స్ అధికారులకు పంపించాలని ఆదేశించారు. దీంతో లోకేష్ విజిలెన్స్ అధికారులు పంపిన ప్రొఫార్మా ప్రకారం వివరాలు అందజేయాలని మండలంలోని 25 సచివాలయాల్లోని పంచాయతీ కార్యదర్శులకు మెయిల్స్ పంపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రకు సంబంధించి బిల్లులు లభించకపోవడంతో అప్పట్లో ఇక్కడ పనిచేసిన అధికారులకు, సిబ్బందికి ఫోన్లు చేసి, వాటి నివేదికలు ఎక్కడున్నాయి, ఎవరు పర్యవేక్షించారనే వివరాలు సేకరించే పనిలో మండల పరిషత్ అధికారులున్నారు.



డీఈవో కార్యాలయం వద్ద శాంతిపురం మండలానికి చెందిన టీచర్లు

సాంకేతిక సమస్యలతో టీచర్లు సతమతం

సర్వీసు పాయింట్లు కోల్పోవడంతో బదిలీల్లో నష్టం జరుగుతుందని ఆవేదన

చిత్తూరు సెంట్రల్, మే 24 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలోని టీచర్ల బదిలీల్లో చోటు చేసుకున్న సాంకేతిక సమస్యలతో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. పనిచేసిన కాలానికి (సర్వీసు) సీలింగ్ ఎత్తివేస్తే బదిలీల్లో తమకు ప్రయోజనం ఉంటుందని శాంతిపురం మండలానికి చెందిన సెకండరీ గ్రేడ్ టీచర్లు శనివారం డీఈవో కార్యాలయానికి వచ్చారు. ఏడాదికి మూడు పాయింట్లు చొప్పున తొమ్మిదేళ్లకు పైబడి మూడో కేటగిరీ ప్రాంతాల్లోని పాఠశాలల్లో పనిచేసిన తమకు ఎనిమిదేళ్ల సీలింగ్ విధించడంతో అదనపు పాయింట్లు కోల్పోయి, బదిలీల్లో నష్టం వాటిల్లుతుందని శాంతిపురం మండలానికి చెందిన టీచర్లు వెంకటేష్, నవీన్, ప్రహస్తి, లలిత, మహేశ్వరి, చంద్రిక తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిదేళ్ల సీలింగ్ పెట్టడంతో జిల్లాలో 700 మంది, రాష్ట్రంలో పదివేల మంది టీచర్లు పాయింట్లు రాకపోవడంతో అనుకూలమైన ప్రాంతాలు వెళ్లలేక నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. సీలింగ్ ఎత్తివేసి తమకు న్యాయం చేయాలని విద్యాశాఖాధికారులకు వినతిపత్రం సమర్పించారు. విడో, ఓల్డ్ స్టేషన్ పాయింట్లు, లీగల్లీ సెపరేటెడ్, 40 ఏళ్ల పైబడిన సింగిల్ ఉమెన్ వంటి వారికి సైతం రావాల్సిన పాయింట్లు విద్యాశాఖ సైట్‌లో చూపించక పోవడంతో బదిలీల్లో తీవ్రంగా నష్టపోతున్నారని వారు తెలిపారు. దీనిపై విద్యాశాఖ అధికారులు వివరణ ఇస్తూ.. ప్రస్తుతం బదిలీల అప్లికేషన్లలో పలు అంశాలకు సంబంధించి సాంకేతిక సమస్యల అప్‌డేట్స్ రాష్ట్రస్థాయిలో జరుగుతున్నాయని చెప్పారు. సర్వీసు పాయింట్లలోని లోపాలు, 2021 తర్వాత రేషనలైజేషన్‌కు గురైన ఉపాధ్యాయుల సమస్యలు, రెండు సార్లు రేషనలైజేషన్‌కు గురైన వారికి ఏడు పాయింట్లు కేటాయింపులు చేసే వీలుందని తెలిపారు.

ఊపందుకున్న మామిడి వ్యాపారం

బేనీషా రకం టన్ను ధర రూ.20-30వేలు



బంగారుపాళ్యం, మే 24 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో మామిడి కాయల వ్యాపారం ఊపందుకుంది. శనివారం తీసుకొచ్చిన మామిడి కాయల్లో టేబుల్ రకాలైన బేనీషా టన్ను ధర రూ.20-30వేల మధ్య, ఖాదర్ రకం రూ.28-29వేల మధ్య, పుల్లూర కలర్ రకం రూ.12-16వేల మధ్య, జ్యూస్‌కి తరలించే పుల్లూర రకం రూ.8వేలు, నాటురకం టన్ను రూ.7వేల ధర పలికింది.

అన్నమయ్య జిల్లాకు ఆరు మండలాల బదిలీ

చిత్తూరు కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి):అన్నమయ్య జిల్లాకు చిత్తూరు జిల్లా నుంచి ఆరు మండలాల బదిలీ అయ్యాయి. ఆంధ్రప్రదేశ్ జిల్లాల (ఏర్పాటు) చట్టం 1974 లోని 3వ విభాగపు 5వ ఉపవిభాగం కింద సంబంధిత ప్రాంతాల మెరుగైన పరిపాలన, అభివృద్ధి దృష్ట్యా అన్నమయ్య జిల్లాకు బదిలీ చేస్తున్నట్లు ఈనెల 22న కలెక్టర్ సుమిత్‌కుమార్ పేరిట చిత్తూరు జిల్లా గెజిట్ ప్రచురితమైంది. పునర్విభజన, పునర్నిర్మాణ చట్ట ప్రకారం చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలోని ఈ మండలాలను అన్నమయ్య జిల్లాలోకి బదిలీచేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రాథమిక గెజిట్ నోటిఫికేషన్ జారీచేశారు. ఈ మేరకు పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, చిత్తూరు రెవెన్యూ డివిజన్‌లోని రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలను అన్నమయ్య జిల్లా మదనపల్లె రెవెన్యూ డివిజన్‌కు బదిలీ చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించినట్లు గెజిట్ నోటిఫికేషన్‌లో వివరించారు.ఈ ప్రతిపాదనతో ప్రభావిత జిల్లాలోని నివాసితులనుంచి అభ్యంతరాలు, సూచనలను నెలరోజుల్లోగా (జూన్ 21లోగా) పంపుకోవచ్చని, వాటిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని కలెక్టర్ ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అటువంటి అభ్యంతరాలు లేదా సూచనలను ఆంగ్లం లేదా తెలుగులో లిఖితపూర్వకంగా చిత్తూరు కలెక్టరేట్‌కు గడువు ముగిసేలోపు పంపాలని ఆ నోటిఫికేషన్‌లో కోరారు.

జిల్లాలోని మావటీలకు మరోసారి శిక్షణ

చిత్తూరు సెంట్రల్, మే 24 (ఆంధ్రజ్యోతి): కుంకీ ఏనుగులను కౌండిన్య అభయారణ్యంలో డ్రైవ్ చేసేందుకు వీలుగా జిల్లాలోని మావటీలకు మరోసారి శిక్షణ ఇవ్వనున్నారు. పలమనేరు, కుప్పం, పుంగనూరు రేంజ్‌లోని 30 మంది అటవీ సిబ్బంది గత ఏడాది డిసెంబరులో మైసూర్‌లోని దుబేరాలో ఏనుగుల డ్రైవ్‌పై శిక్షణ పొందారు. కాగా చిత్తూరు జిల్లా అటవీ ప్రాంతం సరిహద్దు గ్రామాల్లో ఏనుగుల దాడులను అరికట్టడంలో భాగంగా ఇటీవల బెంగళూరు నుంచి ఐదు కుంకీ ఏనుగులు పలమనేరు రేంజ్‌కు వచ్చిన విషయం తెలిసిందే. వీటిలో చిత్తూరు జిల్లాకు నాలుగు కేటాయించగా, ఒకటి తిరుపతి జిల్లాకు కేటాయించారు. ప్రస్తుతం ఐదు ఏనుగులతోపాటు గతంలోని రెండు ఏనుగులు కలిపి మొత్తం ఏడు ఏనుగులు ననియాలలో ఉన్నాయి. బెంగళూరు నుంచి కుంకీ ఏనుగులతో జిల్లాకు వచ్చిన మావటీలు ఇక్కడి వారికి కుంకీ ఏనుగులతో ఎలా డ్రైవ్ చేయాలన్న దానిపై నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఆపై కుంకీ ఏనుగుల సాయంతో జిల్లా అటవీ ప్రాంతాల్లో ఏనుగులు దాడులను అరికట్టనున్నారు.

మా ఇంటికి రండి!

ఆశీర్వదించి వెళ్లండి ● చంద్రబాబు గృహప్రవేశానికి ఇంటింటికీ అందిన ఆహ్వానం



- కుటుంబ సమేతంగా కుప్పం చేరుకున్న సీఎం
- పాతికవేలమందికి పైగా భోజనాలకు ఏర్పాట్లు

ఇంటింటా సందడే. సొంత కుటుంబ సభ్యుడే గృహప్రవేశం చేస్తున్నట్లు తెలియని హడావుడే. అవును.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారంనాడు గృహప్రవేశం చేయనున్నారు. ఇందుకోసం ఆయనతోపాటు కుటుంబ సభ్యులందరూ శనివారం రాత్రికే కుప్పం చేరుకున్నారు. చంద్రబాబు తరపున ఆహ్వానాలు అందుకున్న నియోజకవర్గ ప్రజలు, టీడీపీ కార్యకర్తలు ఆ పండుగకు హాజరై చంద్రబాబు కుటుంబ సభ్యులను ఆశీర్వదించి, విందు భోజనాలు చేసి రావడానికి తయారవుతున్నారు. నియోజకవర్గ ప్రజలకు చంద్రబాబు ముఖ్యమంత్రి మాత్రమే కాదు.. ఎమ్మెల్యే కూడా. అంతమాత్రమేనా.. నిరంతరం వారి క్షేమసమాచారాలు కనుక్కుంటూ బాగోగులు చూసే సొంత కుటుంబ సభ్యుడు కూడా. అందుకే కుప్పంలో ఈ హడావుడి.

కుప్పం, మే 24 (ఆంధ్రజ్యోతి):కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ పరిధిలోని శివపురంవద్ద రెండెకరాల స్థలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నూతన గృహాన్ని నిర్మించుకున్నారు.సతీమణి నారా భువనేశ్వరితో కలిసి కుటుంబ సమేతంగా ఆదివారం తెల్లవారుజామున 3-4 గంటల మధ్య గృహప్రవేశం చేయనున్నారు. చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శనివారం మధ్యాహ్నమే కుప్పం చేరుకుని పీఈఎస్ వైద్య కళాశాల అతిథి గృహంలో బస చేశారు.నూతన గృహానికి వెళ్లి, అక్కడి గృహప్రవేశ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. నారా లోకేశ్, నారా బ్రాహ్మణి దంపతులు కుమారుడు దేవాన్ష్‌తో కలిసి రాత్రి 8 గంటల ప్రాంతంలో కుప్పం చేరుకున్నారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాత్రి 11.30 గంటలకు కుప్పం వచ్చారు. గృహప్రవేశ ఏర్పాట్లు ఘనంగానే జరుగుతున్నాయి. సుమారు 25వేలమందికి భోజనాల ఏర్పాట్లు చేశారు.ఇందుకు అవసరమైన ప్రత్యేకమైన షెడ్లను నూతన గృహ పరిసరాలలో నిర్మించారు. శనివారం రాత్రి సైతం ఇంటివద్ద బంధుమిత్రులకు, వీఐపీలకు భోజనాలు చేసి వడ్డించారు. ఆదివారం మధ్యాహ్నం వేల సంఖ్యలో జనం భోజనాలు చేయనున్నారు. వీవీఐపీ, వీఐపీ, సాధారణ గ్యాలరీలను ఇందుకోసం సిద్ధం చేశారు. శనివారం మధ్యాహ్నం నుంచే వంట ఏర్పాట్లు ప్రారంభమైపోయాయి. నారా భువనేశ్వరి దగ్గరుండి వంటకాలను సిద్ధం చేయించడమే కాక, అవసరమైన ఏర్పాట్లు చూసుకుంటున్నారు. 25 వేలమంది సాధారణ ప్రజలకు, 2 వేలమంది వీఐపీలకు భోజనాలు సిద్ధం చేస్తున్నారు.



సీఎం చంద్రబాబు నూతన గృహం



సిద్ధమవుతున్న వంటకాలు

విందు భోజనం మెనూ

సంప్రదాయ తీపి పదార్థాలు: చక్కెర పొంగలి, జిలేబీ, తాపేశ్వరం కాజా
కారం: సమోసా
అన్నాలు: వెజ్ బిరియాని, టమోటా రైస్, రైతా
కూరలు: మ్యాంగో రైస్, గుత్తివంకాయ మసాలా, మష్‌రూమ్ గుజ్జు కూర, బెండకాయ తాళింపు, బంగాళాదుంపల తాళింపు, వడ పులుసు
భోజనం: తెల్ల అన్నం, ఘీ రైస్, సాంబారు, రసం, ఆవకాయ, గోంగూర పండు మిరపకాయ పచ్చడి, అప్పడం, పెరుగు
డెజర్ట్: క్యారెట్ హల్వా, ఐస్ క్రీమ్
తాంబూలం: మీఠా పాన్.

అందరికీ ఆహ్వానాలు

ముఖ్యమంత్రి స్థానిక ఎమ్మెల్యే కూడా కావడంతో నియోజకవర్గంలోని ప్రతి కుటుంబనుంచి కనీసం ఒక్కరైనా గృహప్రవేశానికి వచ్చి భోజనం చేసి వెళ్లేలా ఆహ్వానం పలకాలని టీడీపీ శ్రేణులకు సూచించారు. సామాజిక మాధ్యమాల్లో డిజిటల్ ఆహ్వాన పత్రికలు పెట్టడంతోపాటు, పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామగ్రామానికి వెళ్లి ముద్రించిన పత్రికలను పంచి గృహప్రవేశానికిప్రజలను ఆహ్వానించారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులకు సైతం ప్రత్యేక ఆహ్వానాలు అందాయి. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్. మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ లతోపాటు మిగిలిన రెండు మూడు మండలాల అధ్యక్షులు ఆహ్వానం పలుకుతూ సామాజిక మాధ్యమాల్లో వీడియో మెసేజ్‌లు పెట్టారు.కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ శనివారం మండలంలోని పలు గ్రామాలకు వెళ్లి ఆహ్వానపత్రికలు పంచి, పసుపు కుంకుమలు ఇచ్చి మరీ ప్రత్యేకించి మహిళలను సంప్రదాయబద్ధంగా గృహప్రవేశానికి ఆహ్వానించారు.

తిరుమల చాలా మారింది ఎంఎస్‌కే ప్రసాద్





ఎంఎస్‌కె ప్రసాద్ - పిచండి - నందకిషోర్

గతంతో పోలిస్తే తిరుమలలో చాలా మార్పులు కనిపిస్తున్నాయని క్రికెటర్ ఎంఎస్‌కే ప్రసాద్ అన్నారు. శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన బయట మీడియాతో మాట్లాడుతూ భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు బాగున్నాయన్నారు. ఇందుకు టీటీడీ అధికారులకు అభినందనలు తెలిపారు. ఇక, ఐపీఎల్ చాలా చక్కగా జరుగుతోందని, కొన్ని కారణాలతో వారంపాటు నిలిచిపోయినప్పటికీ తిరిగి మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం టాప్4లో గుజరాత్, ఆర్సీబీ, పంజాబ్, ముంబాయ్ ఇండియన్స్ ఉన్నారు. ఇక, టాప్2లోకి ఎవరు వస్తారనేది ఆసక్తిగా మారిందన్నారు. కాగా శనివారం తమిళనాడు డిప్యూటీ స్పీకర్ పిచండి, కలెక్టర్ వెంకటేశ్వర్, బళ్లారి ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, సినీనటుడు నందకిషోర్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

తిరుపతి అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును బాధితునికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం పంపిణీ చేశారు. ఐదో డివిజన్‌లోని మారుతినగర్‌కు చెందిన మోహన్ కృష్ణ లివర్ వ్యాధికి చికిత్స చేయించుకున్నాడు. ఆర్థికసాయం కోరుతూ సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆ మేరకు రూ.7లక్షలు మంజూరైంది. ఎమ్మెల్యే సంబంధిత చెక్కును బాధితుడి తల్లికి అందజేశారు. ఐదవ డివిజన్ అధ్యక్షులు పురుషోత్తం పాల్గొన్నారు.


శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2 లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.02 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 74,374

తలనీలాలు సమర్పించినవారు: 37,477





క్రిస్టల్ సర్పెంట్ ఈగల్

- ఆరేళ్లుగా పరిశోధనా కేంద్రానికి తాళం
- నిధులు కేటాయిస్తే వెలుగులోకి శేషాచల విశేషాలు

జీవవైవిధ్య పరిశోధనలకు ఫుల్‌స్టాప్

జీవ వైవిధ్యానికి పుట్టిల్లు శేషాచలం. అరుదైన వృక్షాలు, వనమూలికలు, జంతువులు, కీటకాలు, పక్షులకు నిలయం. ఇక్కడి జీవవైవిధ్య విశేషాలకు విస్తృత ప్రచారం కల్పించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన పరిశోధన కేంద్రం మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలింది. ఏడేళ్లకే మూతబడి పర్యావరణహితుల ఆశలను నీరుగార్చింది.

- మంగళం, (ఆంధ్రజ్యోతి)



శేషాచల కొండల్లో గుర్తించిన స్లేండర్ కోరల్ స్నేక్



అరుదైన మొక్క సైకస్ బెడుమి

తిరుమల శేషాచల కొండలంటే గుర్తుకు వచ్చేది కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వరస్వామి. వెనువెంటనే స్ఫురించేది ఇక్కడి జీవివైవిధ్య సంపద. అరుదైన వృక్షాలు, జంతువులు, అత్యంత విలువైన ఎర్రచందనానికి ఈ కొండలు పెట్టింది పేరు. పెర్రీత, సాంబ్రాణి వంటి 11 అరుదైన వృక్షాలు ఈ అరణ్యాల్లోనే కనిపిస్తాయి. పునుగుపిల్లి, బంగారుబల్లి, బిట్టుడుత, దేవాంగపిల్లి, అలుగు, ఎలుగుబంట్లు, ఏనుగులు, చిరుతలు, దుప్పులు, జింకలు, అడవి పందులు లాంటి ఎన్నో జంతువులు జీవిస్తున్నాయి. ఈ క్రమంలోనే శేషాచల కొండలను టైగర్స్ కారిడార్స్‌గా కూడా మార్చారు. విశేష వాతావరణమున్న ఈ జీవ వైవిధ్యంపై పరిశోధనలు జరిగితే ఎన్నో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తాయని 2012లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి ప్రభుత్వం ఈ జీవవైవిధ్య పరిశోధనశాలకు దాదాపు రూ.50లక్షల బడ్జెట్ కేటాయించింది. ఏపీ



మూతపడ్డ శేషాచల జీవవైవిధ్య పరిశోధనశాల

ఎఫ్ శివరామ్‌ప్రసాద్‌ను ప్రత్యేకాధికారిగా నియమించింది. భూబేష్ గుప్తాతో పాటు మరో ఐదుగురు పరిశోధకులను నియమించింది. పరిశోధకులు భూబేష్ గుప్తా శేషాచల కొండల్లో నాగార్జున సాగర్ రేసర్, శ్రీలంక ఫ్లయింగ్ స్నేక్, స్లేండర్ కోరల్ స్నేక్, ఏలియట్ సీల్డ్‌టైల్, సర్పెంట్ ఈగల్, సైకస్ బెడుమితో పాటు ఎన్నో పుష్పాలను గుర్తించారు. వీటికి సంబంధించిన పరిశోధనలు జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. 2019 తరువాత ఉన్నట్టుండి ఈ పరిశోధనశాలను మూసివేశారు. దీంతో పరిశోధనలూ నిలిచిపోయాయి.

ఆసక్తి చూపని అధికారులు

ఎంతో ప్రాధ్యానత, విశిష్టత ఉన్న శేషాచల జీవ వైవిధ్యాలపై పరిశోధనలకు తెరపడటం పర్యావరణ ప్రేమికులను నిరాశపర్చింది. ఎందరో ఔత్సాహికులు ఇక్కడి పరిశోధనలకు ఆసక్తి చూపిస్తున్నారు. అటవీ శాఖ అనుమతిస్తే వ్యయప్రయాసాలకోర్చయినా కొత్త విశేషాలను వెలుగులోకి తేవడానికి సిద్ధంగా ఉన్నారు. అధికారులు మాత్రం ఈ విషయంలో పెద్దగా ఆసక్తి చూపడంలేదు. గతంలో ఏపీఎఫ్ స్థాయి అధికారిని నియమించి బడ్జెట్ కేటాయించారు. ఇపుడు బడ్జెట్ లేదని అధికారులు చెబుతున్నారు. ఈ బాధ్యతలను బయోట్రిమ్‌కు అప్పగించి చేతులు దులుపుకోడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. అలాగే ఏడాది క్రితం జంతువుల గణనకు ఇద్దరు బయాలజిస్టులను నియమించింది. వారికి వృక్ష, జంతుజాలాల పరిశోధనలతో సంబంధం లేదంటున్నారు. అటవీశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గానీ, టీటీడీ పర్యవేక్షణలో గానీ పరిశోధన కేంద్రాన్ని తిరిగి ప్రారంభిస్తే శేషాచల జీవవైవిధ్యం ప్రపంచానికి పరిచయమవుతుంది.



గతంలో గుర్తించిన గుత్తి టరనుల్లా స్పైడర్

జీవ వైవిధ్యంపై ఎస్వీయూ విద్యార్థినికి మొదటి స్థానం

గుణ విజయ, దీప్తికి వీసీ, రిజిస్ట్రార్ల అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు

తిరుపతి (విశ్వ విద్యాలయాలు), మే 24 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య మండలి - గ్రీన్ క్రాప్ సంయుక్తంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థినికి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం లభించింది. ఎస్వీయూ అనుబంధ మదనపల్లె జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ బీఎస్సీ బయో టెక్నాలజీ రెండో సంవత్సర విద్యార్థిని గుణ విజయ రాష్ట్ర స్థాయి పోటీలో మొదటి స్థానాన్ని పొందారు. అలాగే, పద్మావతి డిగ్రీ కాలేజీలో బీఎస్సీ జువాలజీ రెండవ సంవత్సర విద్యార్థిని దీప్తి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. వారిని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు, కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి అభినందించారు.

సివిల్ సర్వీసెస్ ప్రిలిమనరీ పరీక్షలకు ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ మౌర్య

తిరుపతి(విద్య), మే 24(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేష్ - 2025 నిర్వహణకు ఏర్పాట్లు పక్కాగా ఉండాలని తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఆదివారం నగరంలోని పలు కేంద్రాల్లో సివిల్ సర్వీసెస్ పరీక్ష జరుగనున్నందున శనివారం ఆమె కేంద్రాలను పరిశీలించారు. అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం, ఒత్తిడి లేకుండా పరీక్షలను నిర్వహించేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా నగరంలో మొత్తం 13 కేంద్రాల్లో పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండు సెషన్లుగా పరీక్షలు నిర్వహించనున్నారు.



అఖిలాండం వద్ద భక్తుల రద్దీ

కొండంత రద్దీ



క్యూలో వేచి ఉన్న సర్వదర్శనం భక్తులు



సీఆర్వో వద్ద కిటకిటలాడుతున్న భక్తులు




క్యూలైన్‌లో సర్వదర్శన భక్తులు - ఉచిత బస్సులో సీట్ల కోసం భక్తుల పాట్లు



ఆలయం ముందు...



బస్సులోకి ఎక్కేందుకు ఇబ్బంది పడుతున్న భక్తులు

సమన్వయంతో తుడా అభివృద్ధి

- చైర్మన్ దివాకర్ రెడ్డి



తిరుపతి, మే 24 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అభివృద్ధికి అందరూ కలసికట్టుగా పనిచేద్దామని తుడా చైర్మన్ సి.దివాకర్ రెడ్డి అధికారులకు పిలుపునిచ్చారు. శనివారం తుడా వీసీ ఎన్.మౌర్య అధ్యక్షతన అన్ని విభాగాల అధికారులతో పరిచయ సమావేశం నిర్వహించారు. తుడా పరిధిలో అభివృద్ధి పనులు, ఆయా విభాగాల అధికారుల విధులను ఎన్.మౌర్య వివరించారు. చైర్మన్ మాట్లాడుతూ తుడా పరిధిలోని అన్ని విభాగాల అధికారులు అభివృద్ధికి సహకరించాలని అన్నారు. తుడా నిధులు దుర్వినియోగం కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బందికి అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ సమావేశంలో సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్ బాబు, ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర పాల్గొన్నారు.

చడ్డీగ్యాంగ్‌ల కోసం రాజస్థాన్‌కు మూడు ప్రత్యేక బృందాలు

తిరుపతి(నేరవిభాగం), మే 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఐదేళ్ల క్రితం జరిగిన చడ్డీగ్యాంగ్‌ల దోపిడీలు, చోరీలపై జిల్లా పోలీసు అధికారులు దృష్టి సారించారు. తిరుచానూరు, ఎమ్మార్‌పల్లె, వైజాగ్ లాంటి ప్రాంతాల్లో హైటెక్ పద్ధతిలో ఈ గ్యాంగ్‌లు చోరీలకు పాల్పడ్డాయి. ఐదేళ్లుగా ఈ కేసులు పెండింగ్‌లో ఉండడంతో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి క్రైం సమీక్షా సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయి. ఈ క్రమంలో బాధితులకు న్యాయం చేసేందుకు ఎస్పీ హర్షవర్ధన రాజు నిర్ణయించారు. చడ్డీ గ్యాంగ్‌లను పట్టుకోవడం కోసం తిరుపతి క్రైం పోలీసులతో ప్రత్యేక బృందాలను నియమించి, రాజాస్థాన్‌లోని దోహద్‌కు పంపారు. అక్కడి పోలీసులతో సమన్వయం చేసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఫింగర్ ప్రింట్‌లు, ఫొటోల ఆధారంగా వేట మొదలు పెట్టారు. శనివారం రాత్రి ఈ గ్యాంగుల్లోని ఇద్దరు పాత నేరస్థులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారిని విచారించిన మిగిలిన వారిని పట్టుకునే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

కార్పొరేషన్‌లో ఆర్‌ఐలపై బదిలీ వేటు

తిరుపతి, మే24(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థలో కమిషనర్ మౌర్య ప్రక్షాళన మొదలుపెట్టారు. రెవెన్యూ విభాగంలో ఏళ్లతరబడి పాతుకుపోయిన ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. రెవెన్యూ అధికారి సేతుమాధవ్ పరిధికి సంబంధించి మేయర్ పీఏగా ఉన్న హరిమోహన్, హెల్త్ సెక్షన్‌లో పనిచేసే ఎస్ఎండీ రఫీ, సీనియర్ అసిస్టెంట్లు కె.నరేష్, ఎం.కృష్ణమూర్తి, టైపిస్ట్ నవీన్‌లు ఆర్‌ఐలుగా నియమితులయ్యారు. మరో ఆర్వో రవి పరిధిలో టైపిస్ట్ పి.మునిరత్నం రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.కరుణాకర్, పి.మోహన్, ఎస్.పావనిలను బదిలీ చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఆర్‌ఐలకు ఎలాంటి బాధ్యతలు అప్పగించలేదని తెలిసింది.

వచ్చే నెలకు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి



హౌసింగ్ చీఫ్ జనరల్ మేనేజరు అన్నపూర్ణ

తిరుపతి(కలెక్టరేట్), మే 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జూన్ మొదటి వారానికి 14,001 గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆ శాఖ జిల్లా స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ ఆదేశించారు. గృహ నిర్మాణాలపై కలెక్టరేట్‌లో శనివారం ఆశాఖ అధికారలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 10 నాటికి జిల్లాలో 14,001 గృహాలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. ఇప్పటికే జిల్లాలో 5,468 మంది (ఎస్సీ, ఎస్టీ, బీసీ) లబ్ధిదారులకు అదనపు ఆర్థికసాయం అందజేశామన్నారు. ఆ ఇళ్ల నిర్మాణాలు వెంటనే పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయని వారికి నోటీసులు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ అధకారి దయాకర్, ఈఈ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఐఐ ప్రాజెక్టుతో అభివృద్ధి పథంలో రాష్ట్రం

- పారిశ్రామికవేత్తల శిక్షణ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్



తిరుపతి(వైద్యం), మే 24(ఆంధ్రజ్యోతి): సీఐఐ ప్రాజెక్టుతో రాష్ట్రంలో పరిశ్రమలు పెరిగి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా అభివృద్ధి చెందడానికి అవకాశం ఏర్పడుతుందని ఎంఎస్ఎంఈ, ఎస్ఈఆర్పీ, ఏఆర్ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మానస సరోవర్ హోటల్లో శనివారం సీఐఐ తిరుపతి వారు ఏర్పాటుచేసిన పారిశ్రామికవేత్తల రెండు రోజుల శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పరిశ్రమలతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందనే దృఢమైన ఆలోచనతో సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని 11 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు, ఫ్లాటడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను ప్రారంభించారన్నారు. 2047 నాటికి వార్షిక వృద్ధి రేటు 15 శాతం కంటే ఎక్కువగా సాధించే దిశగా చర్యలు చేపడుతున్నారని వివరించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ పరిశ్రమలకు జిల్లా ఎంతో అనువైందన్నారు. విమానాశ్రయంతోపాటు రెండు పోర్టులు, రెండు జంక్షన్ రైల్వేస్టేషన్‌లు ఉన్నందున పరిశ్రమల నిర్వహణ, రవాణా సులభతరంగా ఉంటుందన్నారు. తిరుపతిలో ఎంఎస్ఎంఈలు 2.5 లక్షల ఉద్యోగాలను సృష్టిస్తున్నాయని తెలిపారు. సీఐఐ రాష్ట్ర వైస్ చైర్మన్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ దేశంలో 2030 నాటికి ఏటా 7.85 మిలియన్ల వ్యవసాయేతర రంగాల ఉద్యోగాలను సృష్టించాలన్నారు. అనంతరం పరిశ్రమల ఆవిష్కరణలను మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ తిరుపతి చైర్మన్ జగన్నాథ్ అనిరుద్, సీఐఐ రాష్ట్ర మాజీ చైర్మన్ విజయ్‌నాయుడు గల్లా, తిరుపతి వైస్ చైర్మన్ రాజేంద్రన్, సీఐఐ ప్రతినిధులు శ్రీనివాస్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సీపీఎల్

తిరుపతి(క్రీడలు), మే 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీయూ తారకరామ స్టేడియంలో సీపీఎల్ మ్యాచ్‌లు హోరాహోరీగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆదిత్య లెవెన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 172పరుగులు చేసింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన రాయల్‌ఛాలెంజ్ తిరుచానూరు జట్టు 18.1ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 175పరుగులు చేసి విజయకేతనం ఎగురవేసింది. ఈ జట్టుకు చెందిన శశాంక్ కేవలం 19బంతుల్లో 56 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నాడు. అతిథులు సురేందర్‌రెడ్డి, శ్రీధర్, సతీష్‌యాదవ్‌లు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రదానం చేశారు. అలాగే మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో స్పోర్టర్ వారియర్స్ జట్టు నిర్ణీత 20ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 171పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన హైపిరియన్ జట్టు 4.1ఓవర్లు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. బ్యాటింగ్‌లో రాణించి విజయానికి బాటవేసిన హర్షరెడ్డిని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు ఎంపికచేయగా అతిథులు డాక్టర్ సాజిత్, మురళీ యాదవ్ అందజేశారు.

ఏకుదారం పుస్తకావిష్కరణ



తిరుపతిరూరల్, మే24(ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పల్లెలోని యూత్ హాస్టల్‌లో అనంతపురానికి చెందిన రచయిత డాక్టర్ బి.నాగోషు రచించిన ఏకుదారం పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఎస్వీయూ ప్రాచ్య పరిశోధనాసంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు ఈపుస్తకాన్ని ఆవిష్కరించగా రచయిత ఆర్‌సీ కృష్ణస్వామిరాజు తొలిప్రతిని అందుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన కథ, నవల రచయిత డాక్టర్ వీఆర్ రాసాని, పీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనవలలో రచయిత నాడీస్పందన ఆద్యంతం కనిపిస్తోందన్నారు. పద్మావతి వర్సిటీ అధ్యాపకురాలు డాక్టర్ వై.సుభాషిణి మాట్లాడుతూ కులవృత్తిదారులు ప్రపంచీకరణలో కొట్టుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బొమ్మిశెట్టి రమేష్ మాట్లాడుతూ జీవితంలో కష్టాలు ఎదురైనప్పుడు ఆత్మపరివర్తన, ఆత్మహత్య అనే రెండుమార్గాలు ఉంటాయని, వీటిలో రచయిత ఆత్మపరివర్తన దిశగా వెళ్లి అత్యద్భుతంగా అభివృద్ధి చెందారని వివరించారు. సమీక్షకులుగా వ్యవహరించిన డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ స్థలం, కాలం, చలనం గురించి ఈ పుస్తకంలో స్పష్టంగా ఉందన్నారు. రచయితలు ఆకుల మల్లేశ్వరరావు, పేరూరు బాలసుబ్రమణ్యం, మారిశెట్టి గోవిందు, డాక్టర్ యువశ్రీ, అమరేంద్ర, నాగార్జునశర్మ, కొండారెడ్డి, ముద్రణకర్త మంజునాథ, భాషాభిమానులు, కవులు పాల్గొన్నారు.

టెన్త్‌లో నారాయణ విద్యార్థినికి 2వ ర్యాంకు

- పునర్మూల్యాంకనంలో 600లకు 599 సాధించిన విద్యార్థిని హృతి



హృతిని అభినందిస్తున్న డీజీఎం కొండలరావు, ఏజీఎం డాక్టర్ శ్రీనివాసులు

తిరుపతి(విద్య), మే 24(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన నారాయణ విద్యాసంస్థల విద్యార్థిని జి.హృతి 10వ తరగతి పునర్మూల్యాంకనంలో రాష్ట్రస్థాయిలో ద్వితీ య ర్యాంకును సాధించింది. ఎం.ఆర్.పల్లిలోని నారాయణ ఒలింపియాడ్ పాఠశాలకు చెందిన హృతి పదవ తరగతి ఫలితాల్లో మొదట 596 మార్కులు సాధించింది. ఇంగ్లిష్‌లో 97 మార్కులు సాధించింది. ఐతే ఇంగ్లిష్ పేపర్ పునర్మూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకుంది. శనివారం ఫలితాలు వెలువడగా 100 మార్కులు వచ్చాయి. దీంతో హృతి మొత్తం 599 మార్కులతో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యాసంస్థల డీజీఎం కొండలరావు, ఏజీఎం డాక్టర్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ మధు చంద్రుడు, ఆర్ఐ జీవీఎస్ కుమార్ విద్యార్థినిని అభినందించారు.





గృహప్రవేశ వేడుకలో పాల్గొనేందుకు శనివారం రాత్రి 11.30 గంటలకు కుప్పం చేరుకున్న సీఎం చంద్రబాబు - మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్సీ శ్రీకాంత్ తదితరుల స్వాగతం - తనను కలిసేందుకు వచ్చిన మహిళలతో లోకేష్ సెల్ఫీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

సీఎం పర్యటనకు పటిష్ఠ బందోబస్తు

కుప్పం, మే 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి కుప్పం పర్యటనకు ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ శివపురం గ్రామం వద్ద నూతన గృహ ప్రవేశం ఆదివారం జరుగనుంది. ఇందు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి దంపతులతోపాటు మంత్రి నారా లోకేశ్, బ్రాహ్మణి దంపతులు శనివారం కుప్పం చేరుకున్నారు. బందోబస్తు ఏర్పాట్లకు సంబంధించి ఎస్పీ మణికంఠ ద్రావిడ విశ్వవిద్యాలయంలో పోలీసు బలగాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ శనివారం మొదలు సోమవారం వరకు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పలుచోట్ల ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్నారు. 600 మంది పోలీసులు బందోబస్తు విధుల్లో ఉంటారని, తమకు కేటాయించిన విధుల్లో అలసత్వం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అంతకుముందు ఎస్పీ మణికంఠ ముఖ్యమంత్రి ఇంటి పరిసరాలను, ఇంటిని పరిశీలించారు. ఈనెల 26న చంద్రబాబు తిరుగు ప్రయాణమయ్యేదాకా పటిష్ఠమైన బందోబస్తు ఇస్తామని చెప్పారు. పార్కింగ్ కోసం, భోజనాల వడ్డింపు కోసం కేటాయించిన స్థలాలను పరిశీలించి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌జీ డైరెక్టర్ నాచ్కేత్ విశ్వనాథ్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శివానంద కిశోర్, కుప్పం డీఎస్పీ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె మాకొద్దు

● పులిచెర్లను మదనపల్లె డివిజన్‌లో కలపడంపై టీడీపీ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న రామనాథం నాయుడు

కల్లూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రెవెన్యూ డివిజన్‌లో కొనసాగుతున్న పులిచెర్ల మండలాన్ని అన్నమయ్య జిల్లా మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో కలిపేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడంపై మండల ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని, దీనిపై సీఎం చంద్రబాబు పునఃపరిశీలించాలని మాజీ జడ్పీటీసీ సభ్యులు, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు రామనాథం నాయుడు కోరారు. పులిచెర్ల మండలం రాయవారిపల్లిలోని ఆయన నివాసంలో శనివారం టీడీపీ, జనసేన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 35 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతి రెవెన్యూ డివిజన్‌లో అనేక ఏళ్లుగా పులిచెర్ల మండలం కొనసాగిందన్నారు. దీంతో మండల ప్రజలకు తిరుపతితో విడదీయరాని బంధం ఏర్పడటంతోపాటు అన్ని వర్గాల ప్రజలు సత్సంబంధాలు కొనసాగించారన్నారు. గత వైసీపీ పాలనలో జిల్లాల విభజనలో భాగంగా పులిచెర్ల మండలాన్ని తిరుపతి రెవెన్యూ డివిజన్ నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిత్తూరు రెవెన్యూ డివిజన్‌కు మార్చినట్లు చెప్పారు. ఈనెల 22న రాష్ట్ర ప్రభుత్వం చిత్తూరు రెవెన్యూ డివిజన్‌లో ఉన్న పులిచెర్ల మండలాన్ని సుమారు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోకి మార్చేందుకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేయడం బాధాకరమన్నారు. పులిచెర్ల మండలానికి అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి, రెవెన్యూ డివిజన్ కేంద్రం మదనపల్లె 80 కిలోమీటర్ల మేర దూరంగా ఉన్నాయన్నారు.దీనిపై మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారని, ప్రజల అభీష్టం మేరకు ప్రస్తుతం కొనసాగుతున్న చిత్తూరు లేక పూర్వపు తిరుపతి రెవెన్యూ డివిజన్‌లో కొనసాగించాలన్నారు. పులిచెర్ల మండల ప్రజల విజ్ఞప్తిని చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పులిచెర్ల రెవెన్యూ డివిజన్‌ను యథావిధిగా కొనసాగించాలని కోరారు. మంగళంపేట సర్పంచ్ మధు, టీడీపీ నాయకులు గోపి నాయుడు, ధనంజయ నాయుడు, రవిమోహన్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు, మోహన్ నాయుడు, దేవ, పార్థసారథి నాయుడు, శేఖర్, గురప్ప, మధు, రవి, గోపాల్, మునేంద్ర, మదన్‌మోహన్‌రెడ్డి, జనసేన నాయకులు మోహన్, మునికృష్ణ పాల్గొన్నారు.

గాంధీ విగ్రహ కూడలిలో యోగాసనాలు



చిత్తూరు క్రీడలు, మే 24 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ఒత్తిడి, ఆరోగ్య సమస్యలను అధిగమించవచ్చని చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. యోగా మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక గాంధీ విగ్రహం కూడలిలో యోగాసనాలు వేసి ప్రజలకు అవగాహన కల్పించారు. జూన్ 21వ తేదీవరకు యోగాపై అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. డీఎస్పీ సాయినాథ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోజూ యోగాకు సమయం కేటాయించి, ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం అధికారులు, విద్యార్థులు, ప్రజలు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు. వన్‌టౌన్ సీఐ మహేశ్వర్, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి దర్శనానికి 3 గంటలు



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ఐరాల(కాణిపాకం), మే 24 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడి దర్శనానికి శనివారం సుమారు మూడు గంటల సమయం పట్టింది. వేసవి సెలవులు కావడంతో జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు స్వామి దర్శనార్థం విచ్చేశారు. అధిక సంఖ్యలో రావడంతో ఆలయ క్యూలైన్లు నిండిపోయాయి. ప్రతి భక్తుడికీ స్వామి దర్శనం కల్పించడానికి ఆలయ అధికారులు కృషి చేశారు.

ఎగువమాసాపల్లె సమీపంలో
భూ కబ్జా సూత్రధారులపై కేసు

చిత్తూరు రూరల్/సెంట్రల్, మే 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలం బండపల్లె రెవెన్యూలోని ఎగువమాసాపల్లె సమీపంలో ఉన్న సర్వే నెం.188/1లో సుమారు 20 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు పక్కనే అటవీ శాఖ భూములు ఉన్నాయి. ఈ భూములను కాజేసేందుకు గత పార్టీలో ఎమ్మెల్యే అనుచరుడు ఒకరు, గువ్వకుల్లు గ్రామానికి చెందిన మరో వ్యక్తి పక్కా స్కెచ్ వేసుకున్నారు. ఈనెల 15వ తేదీన భూములను కబ్జా చేసేందుకు ఎక్స్‌కవేటర్‌తో చదును చేయడం ప్రారంభించారు. దీనిపై స్థానిక గ్రామ ప్రజలు, టీడీపీ నాయకులు కలిసి రెవెన్యూ, అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. దీనిపై మీడియాలో కథనాలు రావడంతో అటవీశాఖ అధికారులు విచారణను ప్రారంభించారు. కబ్జాకు ప్రధాన సూత్రధారులైన కుమార్, లీలాకర్‌రెడ్డి, ఎక్స్‌కవేటర్ యజమాని మధుబాబు, ఆపరేటరు గణేషన్ అలియాస్ గోపీపై శనివారం కేసు నమోదు చేసినట్లు తూర్పు డివిజన్ ఎఫ్ఆర్‌వో థామస్ తెలిపారు. సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్‌ను రెవెన్యూ వారికి అటవీ శాఖాధికారులు అప్పగించారు.

సోమల టూ న్యూఢిల్లీ

● జోరుగా మామిడి ఎగుమతులు



తోతాపురిని ప్యాక్ చేస్తున్న న్యూఢిల్లీ కూలీలు



ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన లారీలు

సోమల, మే 24 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో మామిడి తోటలు విస్తారంగా ఉన్నాయి. 12వేల ఎకరాల్లో పలు రకాల మామిడి సాగులో ఉన్నాయి. ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె, పెద్దఉప్పరపల్లె, పేటూరు, సోమల, ఇరికిపెంట, కామిరెడ్డివారిపల్లె, కందూరు పంచాయతీల్లో మామిడి దిగుబడి అధికంగా ఉంది. ప్రధానంగా తోతాపురి, బేనిషా, మల్లిక, నీలం రకాలు నాణ్యతతో ఉండడంతో వ్యాపారస్తులు పోటీపడి కొనుగోళ్లు చేస్తున్నారు. సోమలలో ఏర్పాటు చేసిన మామిడి మండీల్లో మామిడి కొనుగోళ్లకు న్యూఢిల్లీ, ఒడిశా, మధ్యప్రదేశ్, బిహార్ తదితర రాష్ట్రాల వ్యాపారస్తులు లావాదేవీలు చేస్తున్నారు. నిత్యం ఇక్కడ నుంచి 20 లారీలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు జరుగుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారస్తులే అక్కడి కూలీలను రప్పించుకుని వారిచే మామిడి పండ్లను ప్యాకింగ్ చేసి ఎగుమతులు చేస్తున్నారు. తోతాపురి నాణ్యతను బట్టి టన్ను ధర రూ.17 వేలు నుంచి రూ.24 వేలు వరకు పలుకుతుంది. బేనిషా రకం టన్ను రూ.30 వేలు మించి, మల్లిక రకం రూ.30 వేలు, నీలం టన్ను ధర రూ.20 వేలు పలుకుతుంది. సోమల మామిడి మార్కెట్‌కు సోమల, చౌడేపల్లె, సదుం, కలికిరి, పుంగనూరు మండలాల నుంచి రైతులు, కౌలు వ్యాపారస్తులు తమ కాయలను విక్రయిస్తున్నారు. కాగా సోమలలో ఏఎంసీ యార్డు ఉన్నా పనులు అర్థాంతరంగా ఆగిపోవడంతో వ్యాపారస్తులు ప్రైవేటు స్థలాల్లో గోడౌన్లు ఏర్పాటు చేసుకుని మామిడి కొనుగోలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు.

గాదంకి టోల్‌ప్లాజా సమీపాన దోపిడీ యత్నం

●ఇద్దరు పరారీ.. ఒకరి పట్టివేత



పరారీలో ఉన్న ఇద్దరు యువకులు - పోలీసుల అదుపులో నిందితుడు లోకేష్

చంద్రగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో గాదంకి టోల్ ప్లాజా సమీపంలోని ముగ్గురు దుండగులు దారి దోపిడికి ప్రయత్నించారు. నిందితుల్లో ఒకరిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. శనివారం సాయంత్రం పుంగనూరుకు చెందిన చంద్రశేఖరనాయుడు కుటుంబ సభ్యులు కారులో తిరుపతి వస్తున్నారు. నేండ్రగుంట సమీపంలోని గాదంకి టోల్ ప్లాజా దాటగానే ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు వచ్చి కారును అడ్డగించారు. తాము టోల్ ప్లాజా సిబ్బందిమని చెప్పారు. కారులో డ్రగ్స్ ఉన్నాయని, తనిఖీ చేయాలన్నారు. దీంతో కారులో ఉన్నవారు అనుమానించి వీరి ఫొటోలను తీశారు. ఈలోగానే చంద్రశేఖరనాయుడి భార్య పద్మ మెడలో చైన్ లాక్కెళ్ళేందుకు దుండగులు ప్రయత్నించారు. ఆమె కేకలు వేయడంతో ఇద్దరు ద్విచక్ర వాహనంలో పరారయ్యారు. మరో యువకుడ్ని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ యువకుడు పెనుమూరు మండలం,బొంతివంకకు చెందిన లోకేష్ అని తెలిసింది. పరారైన మరో వ్యక్తి కాణిపాకం సమీపంలోని సిగరపల్లెకు చెందిన మణిగా గుర్తించారు. మూడోవ్యక్తి ఆచూకి కోసం పోలీసులు గాలిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏనుగుల స్వైరవిహారం

● భారీగా టమోటా పంటలకు నష్టం

సోమల, మే 24 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని చిన్నఉప్పరపల్లె పంచాయతీల్లో శుక్రవారం రాత్రి ఏనుగుల గుంపు రైతుల పొలాల్లో సంచరించి పలు పంటలపై స్వైరవిహారం చేసినట్లు రైతులు తెలిపారు. గత రెండు రోజులుగా ఇదే ప్రాంతంలో సంచరించిన ఏనుగులు టమోటా తోటలో సంచరించి టమోటాలకు ఊతంగా నాటిన కర్రలను, పంటను నాశనం చేశాయి. ఏనుగుల దాడులతో లక్షల విలువ చేసే టమోటా, మామిడి తోటలు దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. మామిడితోటలో బేనిషా రకం, మల్లికా రకం కోతలకు సిద్ధంగా ఉన్న చెట్లను ధ్వంసం చేయడంతో నష్టపోయామని, మామిడి సైతం కిలో రూ.40కి చేరుకోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. డ్రిప్‌పైపులు, టమోటా తోటలు కోల్పోయినవారికి నష్టపరిహారం అందజేయాలని శనివారం ఉద్యానశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

28 నుంచి స్పెషల్ కేటగిరీ విద్యార్థులకు కౌన్సెలింగ్

నూజివీడు టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా నూజివీడులోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌లో అడ్మిషన్లకు సంబంధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం 28వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్టు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ ఎస్. అమరేంద్రకుమార్ తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో క్యాప్, బీఎస్జీ, ఎన్‌ఎస్ఎస్ స్పోర్ట్స్, తదితర స్పెషల్ కేటగిరీకి సంబంధించిన ఈ నెల 28వ తేదీ నుంచి 31 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

తిరుపతి జిల్లాకు జవహర్ నవోదయా విద్యాలయం

● 30 ఎకరాల భూమిని గుర్తించాలని కలెక్టర్ ఆదేశం

తిరుపతి, మే 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పరిధిలోని జవహర్ నవోదయా విద్యాలయం తిరుపతి జిల్లాకు మంజూరు కానుంది. దానికోసం జిల్లాలో 30 ఎకరాల అనువైన భూమిని గుర్తించేందుకు కలెక్టర్ వెంకటేశ్వర్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లాల పునర్విభజన తర్వాత చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో జవహర్ నవోదయా విద్యాలయాలు లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రతి జిల్లాలోనూ జవహర్ నవోదయా విద్యాలయాలను ఏర్పాటు చేసే విధానం కింద తిరుపతి జిల్లాకు మంజూరు చేసేందుకు అంగీకరించింది. ఇటీవల సీఎం చంద్రబాబు ఢిల్లీకి వెళ్లి వివిధ శాఖల కేంద్ర మంత్రులను కలసిన సందర్భంలోనూ ఈ ప్రస్తావనకు వచ్చింది. దీంతో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ సానుకూలంగా స్పందించడంతో అనువైన భూములను ఎంపిక చేసి వెంటనే సమాచారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. శనివారం ఉదయం దీనిపై కలెక్టర్ సమీక్షించారు. నవోదయా విద్యాలయం కోసం 30 ఎకరాలు అవసరమని, ఆ మేరకు అందుబాటులో ఉన్న భూములను గుర్తించాలని ఆయన జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్‌ను ఆదేశించారు.జిల్లాలో ఇప్పటికే నాలుగు కేంద్రీయ విద్యాలయాలున్నాయి. తిరుపతిలో రెండు, వెంకటగిరిలో ఒకటి, ఐఐటీ వద్ద ఒకటి చొప్పున నాలుగు ఉన్నప్పటికీ జవహర్ నవోదయా విద్యాలయం లేని లోటు అలాగే ఉండిపోయింది. తాజాగా కేంద్ర ప్రభుత్వ సానుకూల స్పందనతో ఆ లోటు కూడా పూడనుంది.

1న ఉచిత మోడల్ లా-సెట్ పరీక్ష

గుంటూరు(తూర్పు), మే 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీన రాష్ట్రస్థాయి ఉచిత మోడల్ లా-సెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్కా శీనయ్య, కార్యదర్శి నక్కల నాగరాజు యాదవ్, కన్వీనర్ రవి తెలిపారు. గుంటూరు, శ్రీకాకుళం, నెల్లూరు. తిరుపతి, అనంతపురంలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా పరీక్ష నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు కోసం ఆయా జిల్లాల అభ్యర్థులు గుంటూరు- 82974 83785, నెల్లూరు- 99898 50670, తిరుపతి- 94408 10266, అనంతపురం- 94418 88834, శ్రీకాకుళం- 96407 80728 అనే నెంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

ఇన్‌స్టాగ్రాం 'బంధం'
విషాదాంతం

- శ్రీకాళహస్తి యువకుడి చెంతకు విశాఖ వివాహిత
- భర్త, పిల్లలను వీడి ప్రియుడితో వివాహం
- అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి
- విషం తాగి యువకుడు కూడా..



పద్మ(ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, మే 24(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రాం పరిచయంతో చేరువైన వివాహిత, యువకుడి జీవితాలు విషాదాంతమయ్యాయి.విశాఖపట్నంలోని ముస్లింతాటిచెట్లపాలెం వీధికి చెందిన వెంకటలక్ష్మి అలియాస్ పద్మ(40)కు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తుండగా, కుమార్తె డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థిని. ఎక్కువగా ఇన్‌స్టాగ్రాం రీల్స్ చూస్తుండే పద్మకు ఏడాదిన్నర క్రితం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని కైలాసగిరికాలనీకి చెందిన ఎలక్ట్రీషియన్ సురేశ్(25)తో పరిచయం ఏర్పడింది. దీంతో ఏడాది క్రితం పద్మ భర్త, పిల్లలను వదిలేసి ప్రియుడి కోసం శ్రీకాళహస్తికి వచ్చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆమె శ్రీకాళహస్తిలో ఉన్నట్లు గుర్తించిన విశాఖ పోలీసులు ఆమెను తిరిగి కుటుంబసభ్యులకు అప్పగించారు. అయితే, సురేశ్‌తోనే జీవితం కొనసాగించాలని ఉందంటూ లేఖ రాసి గతేడాది నవంబరులో ఆమె మళ్లీ శ్రీకాళహస్తికి వచ్చేశారు. కుటుంబ సభ్యులు బతిమలాడినా రానని తెగేసి చెప్పిన ఆమె సురేశ్‌ను వివాహం చేసుకున్నారు. సురేశ్ తల్లిదండ్రులు అభ్యంతరం తెలపడంతో వారికి దూరంగా కైలాసగిరిలో పద్మతో అద్దె ఇంట్లో కాపురం పెట్టాడు. అయితే, ఏం జరిగిందో గానీ మూడు రోజుల క్రితం పద్మ మృతి చెందారు. దీంతో సురేశ్ కూడా గడియ పెట్టుకుని ఆ గదిలోనే ఉండిపోయాడు. శనివారం బయటకు వచ్చిన సురేశ్ పక్కవీధిలో ఉన్న తల్లి వద్దకు వెళ్లి పద్మ మరణవార్త తెలిపారు. టిఫిన్, భోజనాన్ని వృథా చేస్తోందని మందలించడంతో మూడురోజుల క్రితం పద్మ ఉరి వేసుకుందని, శవాన్ని కిందకు దించి, భయంతో విషం తాగానని సురేశ్ తెలిపారు. మూడురోజుల తరువాత మెలకువ రావడంతో బయటికి వచ్చానన్నారు. సురేశ్ తల్లిదండ్రులు ఇచ్చిన సమాచారం మేరకు శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు పద్మ మృతదేహాన్ని పరిశీలించారు. విశాఖలోని ఆమె కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. విషం తాగిన సురేశ్‌ను ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించారు.



సురేశ్ మృతదేహం


చంద్రబాబు గృహప్రవేశానికి రమ్మంటూ మహిళలను సంప్రదాయబద్ధంగా పిలుస్తున్న టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్

చంద్రబాబు గృహప్రవేశానికి ఆహ్వానం

రామకుప్పం, మే 24 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం కడపల్లె సమీపంలో సీఎం చంద్రబాబు గృహ ప్రవేశానికి రావాలంటూ రామకుప్పం మండలంలో టీడీపీ నేతలు ఇంటింటికీ వెళ్లి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, సోషల్‌మీడియా కుప్పం ఇన్‌చార్జి రాజేంద్రలు రామకుప్పం, పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, కుప్పం మాజీ జడ్పీటీసీ సాంబశివంలు గోవిందపల్లెలో, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, పంద్యాలమడుగు, ఆవులకుప్పంలలో, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతిలు కొంగనపల్లెలో స్థానిక నేతలతో కలిసి గృహప్రవేశానికి కుటుంబ సమేతంగా హాజరు కావాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

రొంపిచెర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం రొంపిచెర్ల టీడీపీ కార్యాలయంలో మహానాడు పర్యవేక్షకుడు ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, నియోజకవర్గ పర్యవేక్షకుడు దంపూరి భాస్కర్ సమక్షంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం నెరవేర్చుతుందన్నారు. కడపలో జరిగే మహానాడు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారని, పుంగనూరు నియోజకవర్గం నుంచి 8 లక్షలమంది టార్గెట్‌గా రావల్సిందిగా కోరారు. చల్లా బాబు ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు బాధ్యతగా జనసమీకరణ చేయాలన్నారు. రొంపిచెర్ల, పులిచెర్ల, సోమల, సదుం, చౌడేపల్లి, పుంగనూరు మండలాలకు బస్సులు, ప్రైవేట్ వాహనాల సౌకర్యం కల్పించాల్సిందిగా ఆయా మండల పార్టీ అధ్యక్షులు ఉయ్యాల రమణ, సుబ్రమణ్యం నాయుడు, ధనంజయ నాయుడు, గువ్వల రమేష్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మాధవరెడ్డి కోరారు. దంపూరి భాస్కర్ మాట్లాడుతూ సోమల మండలంలో జరిగిన మినీ మహానాడుకు అధికసంఖ్యలో జనం వచ్చారని, కడప మహానాడుకు ఎంత మంది వస్తారనేది చెప్పలేమన్నారు. వైస్ ఎంపీపీ నూలు రెడ్డెప్ప, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, మాజీసర్పంచ్ రవి నాయుడు, నాయకులు మదనమోహన్‌రెడ్డి, అమరనాథరెడ్డి, ఇమ్రాన్‌ఖాన్, షేక్ కరీముల్లా, నాగరాజ, శేషాద్రి నాయుడు, మహేష్, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కలసికట్టుగా మహానాడును విజయవంతం చేద్దాం

● టీడీపీ పరిశీలకురాలు శ్రీదేవి


మాట్లాడుతున్న శ్రీదేవి

గంగవరం, మే 24 (ఆంధ్రజ్యోతి: ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి టీడీపీ నాయకులందరూ కలసికట్టుగా పనిచేయాలని పలమనేరు నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్, మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం పలమనేరు టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. గతంలో వైసీపీ ప్రభుత్వం అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు వారిని ఇంటికి సాగనంపారన్నారు. పేదల కడుపులు కొట్టే ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వం అయితే, పేదల కడుపులు నింపేది కూటమి ప్రభుత్వం అన్న విషయం ప్రజలందరికీ తెలిసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలిసారిగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబోతున్న మహానాడుకు నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని సూచించారు. వీ.కోట, బైరెడ్డిపల్లె, పలమనేరు, పెద్దపంజాణి, గంగవరం మండలాల అధ్యక్షులు రంగనాథ్, కిషోర్‌గౌడు, ఆర్‌బీసీ కుట్టి, నాగరాజురెడ్డి, ఆనంద్, సోమశేఖర్ గౌడ్, సీనియర్ నాయకులు ఆర్‌వీ బాలాజి, రామచంద్ర నాయుడు, ఖాజీపీర్, నాగరాజు, గిరిబాబులతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు బీమా సౌకర్యం


టీడీపీ కార్యకర్తలకు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

పుంగనూరు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి పార్టీ బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని రాగానిపల్లె, చదళ్ల, కుమ్మరనత్తం పంచాయతీల పరిధిలో టీడీపీ కమిటీల ఎన్నికలు నిర్వహించి, అధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం నాయుడు, సుధాకర్‌రెడ్డి, అమరనాథ్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన పార్టీ అధ్యక్షులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేయాల్సి ఉందన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు మోహన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరాజు, రమణ, గంగాధర్, సోము తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై ముగిసిన శిక్షణ

కుప్పం, మే 24 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఇంజనీరింగ్ కళాశాల, ఐసీటీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అంశంపై వారం రోజులపాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు అధ్యాపకుల పరిశోధనలకు ఉపయోగపడుతాయన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధ్యాపకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐసీటీ అకాడమీ టెక్నికల్ ట్రైనర్ ఎస్.వేణుగోపాల్, కేఈసీ వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, ఆర్ అండ్ డీ విభాగాధిపతి జీఎన్.కోదండరామయ్య, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డి.జయకుమార్, వివిధ విభాగాధిపతులు, పీఆర్వో ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


ఫ్యాకల్టీతో ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు తదితరులు

ఘర్షణ పడిన ఇరువర్గాలపై కేసు నమోదు

పుంగనూరు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): భూతగాదాలో ఘర్షణపడిన ఇరువర్గాలపై శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు.. పట్టణంలోని సుబేదార్‌వీధికి చెందిన మహ్మద్ కుమారులు ఇబ్రహీం, మహ్మదాలీ, మహియాలు ఆస్తి కోసం ఒకరిపై మరొకరు దాడి చేసుకోవడంతో ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సోదరితో విభేదాలు... అన్న ఆత్మహత్యాయత్నం

చౌడేపల్లె, మే 24 (ఆంధ్రజ్యోతి): అన్నా, చెల్లెలు ఘర్షణ పడటంతో అన్న ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం చౌడేపల్లె మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.... మండలంలోని ఆమినిగుంట గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు శేఖర్(20) గ్రానైట్ పనులు చేసుకుని జీవనం సాగిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో అన్న శేఖర్, చెల్లి హేమవతిలు గొడవ పడ్డారు. దీంతో మనస్థాపానికి గురైన శేఖర్ ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, డాక్టర్ సూచనల మేరకు అన్నమయ్య జిల్లా మదనపల్లెకు తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

భూ సమస్యపై ఘర్షణ... కేసు నమోదు

పుంగనూరు రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): భూ సమస్యపై ఏర్పడిన ఘర్షణలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు శనివారం ఏఎస్ఐ అశ్వర్థనారాయణ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు... మండలంలోని మంగళం పంచాయతీ కంగానెల్లూరుకు చెందిన లక్ష్మన్న కుమారుడు చిన్నరెడ్డెప్ప, గంగులప్పలు అన్నదమ్ములు. ఇద్దరి మధ్య భూ సమస్య ఉండటంతో చిన్నరెడ్డెప్పపై గంగులప్ప దాడి చేశాడు. చిన్నరెడ్డెప్ప ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆకట్టుకున్న బలిబండి ప్రదర్శన

సోమల, మే 24 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నంజంపేట గార్గేయనదీ తీరంలో కొలువుదీరిన గార్గేయ గౌరీలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జరుగుతున్న మహాయజ్ఞం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకపూజలు ఘనంగా జరిపారు. కార్యక్రమంలో భాగంగా నంజంపేట, చీకలవారిపల్లె, కమ్మపల్లెలో బలిబండిలో భీమసేన వేషధారుడు అన్నదాన సేకరణ ప్రజలను ఆకట్టుకుంది. పలువురు ఇంటింట భోజనంతో పాటు అల్పాహారం, నగదు కానుకలు అందజేశారు. ఉభయదారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పలువురు దాతలు మహాభారత యజ్ఞ నిర్వహణకు విరాళాలు అందజేశారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

పుంగనూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని మినీబైపాస్‌రోడ్డు నుంచి ప్రభుత్వాస్పత్రి వరకు పారిశుధ్య పనులు చేయించినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై మట్టి చేరడంతో వాహనాల రాకపోకల సమయంలో దుమ్ములేచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించి రోడ్లను శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. కాల్వల్లో సిల్ట్‌ను తీయిస్తున్నట్లు చెప్పారు.

ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పుంగనూరు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని దొడ్లపాల డెయిరీ మేనేజర్ అరులానందన్ కోరారు. శనివారంమండలంలోని కొత్తపల్లెలో దొడ్ల పాల డెయిరీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పాడి పశువులకు వ్యాధులు సోకిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డెయిరీ డాక్టర్ సత్యఓంకారం వివరించారు. బలహీనంగా ఉన్న పశువులకు కాల్షియం మందులు అందించాలని సూచించారు. సమావేశంలో డెయిరీ అధికారి రామారావు, రైతులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరి

కుప్పం, మే 24 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించడం తప్పనిసరి అని కుప్పం ఎక్సైజ్ సీఐ నాగరాజు అన్నారు. నియోజకవర్గంలోని మద్యం దుకాణాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ దుకాణాలకు కేటాయించిన సమయాల్లోనే మద్యం అమ్మకాలు చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్సైజ్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

● గంగవరం (ఆంధ్రజ్యోతి): పలమనేరులో పలు మద్యం దుకాణాలను ఎక్సైజ్ సీఐ భాగ్యలక్ష్మి తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ... పలమనేరు పరిధిలో ఉన్న మద్యంషాపులు, బార్ల వద్ద రాత్రి గస్తీ నిర్వహిస్తూ అక్రమ మద్యం వ్యాపారాలకు చెక్ పెడుతున్నామన్నారు.

● రొంపిచెర్ల (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలోని మద్యం దుకాణాల్లోని స్టాక్, రికార్డులను ఎక్సైజ్ సీఐ మాధవస్వామి తనిఖీ చేశారు. బెల్ట్‌షాపులు నడపరాదన్నారు. దుకాణాల్లో తాగించరాదని తెలిపారు. ఫిర్యాదులేమైనా ఉంటే 91824 91056 నెంబరుకు తెలియజేయాలని సీఐ కోరారు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, హెచ్‌సీ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పెండ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు

రొంపిచెర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని గన్నిమిట్టవారిపల్లెలోని పెండ్లి గంగమ్మ అమ్మవారికి గంగజాతరలో భాగంగా శనివారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి, ఆయన తల్లి మాజీ ఎంపీపీ చల్లా ప్రేమలతమ్మ, సతీమణి, మాజీ సర్పంచ్ చల్లా సుప్రియారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలి

సదుం, మే 24 (ఆంధ్రజ్యోతి): సదుం మండల పరిధిలోని ఎస్సీ ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదని సంఘ నాయకులు ఉమామహేశ్వరరావు, చంద్రమ్మ, శ్రావణిలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తహసీల్దారు జయప్రకాశ్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సమావేశాలు సకాలంలో నిర్వహించి, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దారును కోరారు.

యోగా సాధనతో ఆరోగ్యం

కుప్పం, మే 24 (ఆంధ్రజ్యోతి): మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా మెరుగైన సాధనమని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుప్పం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ముందస్తు యోగా శిక్షణ ఇచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరూ అభ్యసించాలని పిలుపునిచ్చారు.

మార్కెట్ యార్డులో మౌలిక వసతులు కల్పించాలి

పుంగనూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో మౌలిక వసతులు కల్పించాలంటూ శనివారం మార్కెట్ యార్డు కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు నాగరాజ, రమణారెడ్డి, మున్నా తదితరులు నిరసన తెలిపారు. ఇక్కడకు వచ్చే రైతులు, కూలీలు, వ్యాపారస్తులకు కనీస అవసరాలైన తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు.

యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే భానుప్రకాష్



జాబ్‌మేళాలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, మే 24 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. తమిళనాడులోని తిరుత్తణికి చెందిన ఎంఆర్ఎఫ్ కంపెనీ ఆధ్వర్యంలో శనివారం ఏకాంబరకుప్పంలో నిర్వహించిన జాబ్‌మేళాకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. యువత కోసం సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఇతర రాష్ట్రాల్లోని కంపెనీలను కూడా ఏపీకి రప్పించి జాబ్‌మేళా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారని ప్రశంసించారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను ఎమ్మెల్యే అందించారు.

కాణిపాకంలో ప్రదోష కాల పూజలు



మహానందికి క్షీరాభిషేకం

ఐరాల(కాణిపాకం), మే 24 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న మరగదాంబిక సమేత మణికంఠేశ్వర స్వామి గుడిలో శనివారం సాయంత్రం ప్రదోష కాల పూజలను నిర్వహించారు. సాయంత్రం మూల విరాట్‌కు, స్వామికి ఎదురుగా ఉన్న మహానందికి ఏకకాలంలో క్షీరాభిషేకం, అభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ పూజలు తిలకించడానికి భారీగా భక్తులు కాణిపాక క్షేత్రానికి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పెంచలకిషోర్, ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, అర్చక, పండితులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి: ఎంపీడీవో

వెదురుకుప్పం, మే 24 (ఆంధ్రజ్యోతి): పచ్చికాపల్లం దాసరికాలనీలోని డ్రైనేజీ సమస్యకు త్వరలో పరిష్కారం చూపుతామని వెదురుకుప్పం ఎంపీడీవో ఎల్.పురుషోత్తం తెలిపారు. శనివారం డ్రైనేజీ సమస్య ఉన్న ప్రాంతాన్ని డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌కుమార్, గ్రామ కార్యదర్శి సాయి భవాని, వీఆర్వో భీమయ్య, సర్వేయర్ మునిదేవిక, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సింధూజ, ఉద్యోగులతో కలసి వెళ్లి పరిశీలించారు.

రోడ్డుకిరువైపులా ఆక్రమణలు తొలగించాల్సిందే: పచ్చికాపల్లంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని ఎంపీడీవో తేల్చి చెప్పారు. శనివారం ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్య తలెత్తిన ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రామ పంచాయతీ, రెవెన్యూ, రోడ్లు, భవనాలశాఖ ఉద్యోగులతో కలసి మార్కింగ్ చేశారు.

రెండు ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం: రాగివైర్ల అపహరణ



బాలకృష్ణాపురంలో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

పాలసముద్రం, మే 24 (ఆంధ్రజ్యోతి): బాలకృష్ణాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి చంద్రశేఖర్ నాయుడు, దామోదర్‌నాయుడికి చెందిన వ్యవసాయ భూముల్లో ఉన్న 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ధ్వంసం చేసి, అందులోని రాగి వైర్లను అపహరించుకెళ్లారు. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో ఏఈ లోకేష్‌రెడ్డికి బాధితులు తెలిపారు. ఆయన పాలసముద్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల కిందట ఆముదాల, శ్రీకావేరిరాజుపురం గ్రామాల్లో రెండేసి ట్రాన్స్‌ఫార్మర్లు ఇలాగే ధ్వంసమయ్యాయి. మండలంలో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతుండటంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు రాత్రిపూట గస్తీని ముమ్మరం చేసి, చోరీలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

రేపు నేత్ర వైద్య ఉచిత శిబిరం

బంగారుపాళ్యం, మే 24 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యంలోని ముత్యాలమ్మ ఆలయ సమీపంలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో సోమవారం చెన్నైకి చెందిన ఎంఎన్ఐ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో నేత్ర వైద్య ఉచిత శిబిరం జరగనుంది. ఈ మేరకు ఆర్గనైజర్ పెరియంబాడి నాగరాజ్ తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో 'విప్రో' ప్రతినిధులు



చిత్తూరు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని ముత్తుకూరు పంచాయతీ తాటిమాకులపల్లెలో సదాశివనాయుడు అనే రైతు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని నిర్వహిస్తున్నాడు. ఈ క్షేత్రాన్ని శనివారం విప్రో కంపెనీ ప్రతినిధి అన్వర్ తన ఫార్మర్ సైంటిస్టుల బృందంతో కలిసి సందర్శించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై ప్రకృతి వ్యవసాయంలో లాభనష్టాలను అడిగి తెలుసుకున్నారు. విప్రో కంపెనీ సలహాదారులు శివకార్తీక్, ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ వాసు, డీపీఎంయూ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు మాతృ వియోగం

గంగాధరనెల్లూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): ఆత్మ మాజీ చైర్మన్, బాలగంగనపల్లె మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నేత దేవరాజులుకు తల్లి లక్ష్మమ్మ (88) అనారోగ్యంతో శనివారం తెల్లవారు జామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, భీమనేని చిట్టిబాబునాయుడు, శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, జ్యోతీశ్వర్‌రెడ్డి, రఘునాధనాయుడు తదితరులు బాలగంగనపల్లెకు వెళ్లి లక్ష్మమ్మకు పుష్పాంజలి సమర్పించారు.

సదాశివేశ్వరస్వామి ఆలయంలో పూజలు



వెదురుకుప్పం, మే 24 (ఆంధ్రజ్యోతి): కార్వేటి నగరంలోని సదాశివేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ప్రదోష కాల పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు హాజరయ్యారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు మోహన్‌రాజు పర్యవేక్షించారు.

పాలసముద్రం పీహెచ్‌సీలో సిబ్బంది కొరత



పాలసముద్రం, మే 24 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో సిబ్బంది కొరత ఉంది. దీనివల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఇద్దరు డాక్టర్లు పనిచేసేవారు. ఆరు నెలల కిందట ఇక్కడ పనిచేస్తుండిన డాక్టర్ లోకేష్ చిత్తూరు కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లారు. యూడీసీ పోస్టు రెండేళ్లుగా ఖాళీగా ఉంది. అలాగే అటెండర్ పోస్టు ఐదేళ్లుగా, ఏఎన్ఎం పోస్టు ఏడాదిగా ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం డాక్టర్ కృష్ణమోహన్ ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. ఏదైనా కారణంతో ఈ డాక్టర్ సెలవు పెడితే రోగులకు మరిన్ని కష్టాలు తప్పడం లేదు. సిబ్బంది కొరతతో ఉన్న సిబ్బందిపై పనిభారం పడుతోంది. ఇకనైనా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని జనం కోరుతున్నారు.

రేషన్ సరుకులు సకాలంలో అందించండి: ఎమ్మెల్యే

నగరి, మే 24 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను సకాలంలో అందించాలని డీలర్లకు ఎమ్మెల్యే భానుప్రకాష్ సూచించారు. నగరి మండలంలోని రేషన్ డీలర్లు శనివారం ఉదయం ఎమ్మెల్యేను ఆయన స్వగృహంలో కలిసి సన్మానించారు. ఎండీయూ వాహనాలను రద్దు చేయడంపై ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. డీలర్లు శివకుమార్‌రెడ్డి, నారాయణస్వామి నాయుడు, ఉమాపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

శ్రీరంగరాజపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు గ్రామాల్లో నిర్వహించే పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తయ్యూరు పశువైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య సూచించారు. శనివారం రాఘవ రాజపురంలో కాసా ప్రాజెక్ట్ తరఫున పాడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రీజినల్ డైరెక్టర్ కరుణ, కాసా, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పాడి రైతులతో మాట్లాడుతున్న పశువైద్యాధికారి శ్రీవిద్య

శిథిలావస్థలో పశు వైద్యశాల భవనం



భయాందోళనలో సిబ్బంది



49.కొత్తపల్లెమిట్టలో ఉన్న ప్రాంతీయ పశు వైద్యశాల భవనం - పెచ్చులూడిన పైకప్పు

శ్రీరంగరాజపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): 49.కొత్తపల్లెమిట్టలోని ప్రాంతీయ పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరడంతో ఇక్కడి సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ఏళ్లతరబడి పట్టించుకోక పోవడంతో పైకప్పు పెచ్చులూడి వర్షాలకు ఉరుస్తోంది. మందులు తడిచిపోతున్నాయి. గోడలు సైతం పగుళ్లిచ్చాయి. కరెంట్ సౌకర్యమూ లేదు. గతంలో వైద్యశాల ఆవరణంలోకి, గదుల్లోకి పలమార్లు పాములు కూడా వచ్చాయి. ఉన్నతాధికారులు స్పందించి ఈ భవనానికి మరమ్మతులు చేయడమో లేదా కొత్తది నిర్మించడమో చేయాల్సిన అవసరం ఉంది.

హనుమంత, గజ వాహనాలపై వేణుగోపాలుడి విహారం



హనుమంత, గజ వాహనాలపై ఊరేగుతున్న స్వామివారు - వాహన సేవ ముందు కోలాటం వేస్తున్న కళాకారులు

వెదురుకుప్పం, మే 24 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం హనుమంత, గజ వాహనాలపై స్వామివారు విహరించారు. వాహన సేవల ముందు కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో నిత్య కైంకర్యాలు జరిగాయి. తర్వాత హనుమంత వాహనంపై స్వామివారు ఊరేగారు. మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఆలయంలో వసంతోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆపై ఆస్థానం, మాడవీధి ఉత్సవం జరిగింది. సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటల వరకు ఊంజల్ సేవను ఆలయ ఆవరణంలో నేత్రపర్వంగా నిర్వహించారు. రాత్రి గజ వాహనంపై స్వామివారు ఊరేగారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు బాబుసురేష్, కంకణభట్టార్ తరుణ్‌కుమార్, వేదపండితులు నారాయణదాసరి, గోపాలాచారి, శబరీష్, రమేష్, ధన్వంతరి, ప్రశాంత్, భక్తులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ ఇస్తున్న ఫైర్ సిబ్బంది

చిత్తూరు సెంట్రల్, మే 24 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన అంశాలపై ఎన్‌సీసీ క్యాడెట్లకు జిల్లా అగ్నిమాపక సిబ్బంది అవగాహనతో కూడిన శిక్షణ ఇచ్చారు. ఎన్‌సీసీ క్యాంపులో భాగంగా శనివారం అగ్ని ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా క్యాంపు కమాండింగ్ అధికారి కల్నల్ మోనిష్, ఏవో లోకనాథం, జిల్లా ఫైర్ సిబ్బంది సురేష్, గిరిబాబు, అన్వరసన్, హరినాల్, మనోజ్, మహేష్ రాయ్, ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, కార్తీక్, శ్రీలత, వినోద్, మొగిలినాయుడు, మస్తాన్, వెట్రియన్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పన్నూరు ఆది ఆంధ్రవాడలో సీసీ రోడ్డు నిర్మాణం



సంతోషం వ్యక్తం చేస్తున్న స్థానికులు

విజయపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): పన్నూరు ఆది ఆంధ్రవాడలో శనివారం సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నెరవేర్చారు. రూ.7.4 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీనిపై ఎమ్మెల్యేకు స్థానికులు, టీడీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

చెరువుకట్ట తవ్వేయడంతో పొంచి ఉన్న ప్రమాదం



చెరువు కట్టను తవ్వేశారిలా..

పెనుమూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): గుంటిపల్లె చెరువు కట్టను కొందరు స్థానికులు తవ్వేయడంతో ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పెద్ద చెరువుల్లో ఇదొకటి అని తెలిపారు. ఈ చెరువు నిండితే కొన్ని వందల ఎకరాల ఆయకట్టు భూములు సస్యశ్యామలంగా మారుతాయన్నారు. అలాంటి చెరువు కట్టను తవ్వేయడంతో బలమైన వర్షం కురిస్తే తెగే ప్రమాదం ఉందని, అయినా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని పేర్కొన్నారు. పైగా రోడ్డుకు ఆనుకుని చెరువు కట్ట ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఎక్కువగా ఉందన్నారు.

అలరించిన 'రేలా.. రే.. రేలా'



వేదికపై కళాకారులు

చిత్తూరు కల్చరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): కట్టమంచి శాంత రఘురామన్ కల్యాణ మండపంలో ప్రముఖ జానపద కళాకారుడు దామోదర్ గంగాధర తన బృందంతో శనివారం నిర్వహించిన 'రేలా.. రే.. రేలా' ప్రదర్శన అలరించింది. దాదాపు 11 మంది కళాకారులు తమ జానపద గీతాలతోపాటు నృత్యాలు చేశారు. అనంతరం కళాకారులను నిర్వాహకులు సత్కరించారు. గీత, చందు, శివ, కళాభిమానులు పాల్గొన్నారు.


వైభవంగా వినాయక స్వామి తిరునాళ్ల



వినాయకుడి ఊరేగింపులో పాల్గొన్న చెన్నకేశవులు నాయుడు తదితరులు

గుడిపాల, మే 24 (ఆంధ్రజ్యోతి): రామభద్రాపురం పంచాయతీ చుక్కావానిపల్లెలో సెల్వి వినాయక స్వామి, గ్రామదేవతైన పొన్నెమ్మ తిరునాళ్లను శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం పురోహితుడు మహేష్‌శర్మ.. సెల్వి వినాయక గణపతి హోమం, కుంభాభిషేకం చేపట్టారు. మధ్యాహ్నం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల హేమాద్రినాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం వినాయక స్వామి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. జీజేఎం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గురజాల చెన్నకేశవులు నాయుడు, ఎంపీటీసీ గోళ్ల హరిప్రసాద్, టీడీపీ నాయకులు బాలసుబ్రహ్మణ్య యాదవ్, హరి, చల్లా పాల్గొన్నారు.

విద్యార్థినుల తాగునీటి సమస్యకు పరిష్కారం



బోరు నుంచి వస్తున్న నీరు

వెదురుకుప్పం, మే 24 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ బాలికల వసతి గృహం విద్యార్థినుల తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి తెలిపారు. శనివారం రాత్రి హాస్టల్‌లో రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ ఆదేశాలతో బోరు డ్రిల్లింగ్ చేయించామన్నారు. పుష్కలంగా నీరుపడ్డాయని చెప్పారు. 18 ఏళ్లుగా విద్యార్థినులు నీటి కొరతతో ఇబ్బంది పడుతున్నాని వివరించారు. వైసీపీ హయాంలో ఈ సమస్య తీర్చాలని వారు విన్నవించినా పట్టించుకోలేదని విమర్శించారు.

రోడ్డు నిర్మాణం పూర్తయ్యేదెప్పుడు?

● తీవ్ర ఇబ్బంది పడుతున్న స్థానికులు



కోతకు గురైన వనదుర్గాపురం రోడ్డు

పాలసముద్రం, మే 24 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం నుంచి వనదుర్గాపురం పంచాయతీలోని గ్రామాలకు వెళ్లడానికి గత వైసీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ రోడ్డు నిర్మాణ పనుల కాంట్రాక్టును అప్పటి డిప్యూటీ సీఎం నారాయణస్వామి సమీప బంధువు దక్కించుకున్నారు. నిధులు కూడా సుమారు రూ.4కోట్లు మంజూరయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు నారాయణస్వామికి, ఆయన సమీప బంధువుకు మనస్పర్థలు రావడంతో బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేసి.. మిగిలిన పనులను మధ్యలోనే ఆపేశారు. ఏడాదిగా పనులు ప్రారంభించకపోవడంతో వర్షాలకు ఉన్న మట్టిరోడ్డు కోతకు గురైంది. ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లడానికి వీల్లేకుండా ఉంది. ప్రస్తుతం మండల కేంద్రం నుంచి వనదుర్గాపురానికి తమిళనాడులోని అత్తిమంజేరిపేట మీదుగా వెళ్లాల్సి వస్తోంది. దీనివల్ల 14 కిలోమీటర్లు చుట్టుకుని వెళ్లాల్సి రావడంతో జనం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు చొరవచూపి రోడ్డు నిర్మాణం పూర్తిచేయించాలని స్థానికులు కోరుతున్నారు.

మద్యం దుకాణదారులు సమయపాలన పాటించకుంటే చర్యలు



కాణిపాకం పట్నం సమీపంలోని మద్యం దుకాణాన్ని పరిశీలిస్తున్న సీఐ పురుషోత్తం - నగరిలో రాత్రిపూట గస్తీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

చిత్తూరు సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణదారులు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని చిత్తూరు ఎక్సైజ్ రూరల్ సీఐ పురుషోత్తం హెచ్చరించారు. శుక్రవారం రాత్రి రూరల్ పరిధిలోని మద్యం దుకాణాలను తన సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటలవరకు అమ్మకాలు జరపాలన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తరచూ తనిఖీలు ఉంటాయన్నారు.

నగరి: మద్యం దుకాణదారులు నిబంధనలు పాటించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు రెడ్డి స్పష్టం చేశారు. నగరి పరిధిలో శుక్రవారం రాత్రి వివిధ మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. రాత్రిపూట గస్తీ నిర్వహించారు.

సంక్షిప్తంగా..

నేడు నేత్ర వైద్య ఉచిత శిబిరం

చిత్తూరు కల్చరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): రాములగుడి వీధి జైన్ ప్రార్థనా మందిరంలో ఆదివారం నేత్ర వైద్య ఉచిత శిబిరం నిర్వహిస్తున్నట్లు జైన్ సంఘం అధ్యక్షుడు సుభాష్ జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి అరవింద నేత్ర వైద్యశాల సహకారంతో ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు రోగులకు పరీక్షలు చేసి.. మందులు, కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఆపరేషన్లు అవసరమైనవారికి కూడా తమ సంఘం తరపున ఉచితంగా చేయిస్తామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రదోష కాల పూజలు

చిత్తూరు కల్చరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శైవ ఆలయాల్లో శనివారం ప్రదోషకాల పూజలను నిర్వహించారు. కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వర, కాశీ విశ్వేశ్వర, కట్టమంచి కులందేశ్వర, గిరింపేట శివగామి సుందరీ సమేత చిదంబరేశ్వర ఆలయాల్లో పరమ శివుడికి రుద్రాభిషేకాలు, ప్రథమ, ద్వితీయ కాల పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వన వేణుగోపాలుడికి పూజలు



వెదురుకుప్పం, మే 24 (ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఏర్పాట్లను ఆలయ ప్రధాన కార్యనిర్వాహకుడు శివకుమార్ పర్యవేక్షించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి అదృశ్యంపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కొంగారెడ్డిపల్లెలో శోభ దంపతులు తమ కుమార్తె గోవర్థిణి(23)తో కలిసి నివాసముంటున్నారు. శుక్రవారం ఇంటి నుంచి బయటికెళ్లిన గోవర్థిణి తిరిగి రాలేదు. దీంతో పోలీసులకు యువతి తల్లి శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

యాదమరి, మే 24 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వరదరాజులపల్లెలో వేణుగోపాల్ రెడ్డి, సుకన్య (41) దంపతులు నివాసం ఉంటున్నారు. దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో శనివారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. గమనించిన కుటుంబీకులు అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అయితే ఈ ఘటనపై యాదమరి పోలీసులకు ఫిర్యాదు అందలేదని సమాచారం.

సోదరితో విభేదాలు

● అన్న ఆత్మహత్యాయత్నం

చౌడేపల్లె, మే 24 (ఆంధ్రజ్యోతి): అన్నా, చెల్లెలు ఘర్షణ పడటంతో అన్న ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం చౌడేపల్లె మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.... మండలంలోని ఆమినిగుంట గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు శేఖర్(20) గ్రానైట్ పనులు చేసుకుని జీవనం సాగిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో అన్న శేఖర్, చెల్లి హేమవతిలు గొడవ పడ్డారు. దీంతో మనస్థాపానికి గురైన శేఖర్ ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, డాక్టర్ సూచనల మేరకు అన్నమయ్య జిల్లా మదనపల్లెకు తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

భూ సమస్యపై ఘర్షణ

● కేసు నమోదు

పుంగనూరు రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): భూ సమస్యపై ఏర్పడిన ఘర్షణలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు శనివారం ఏఎస్ఐ అశ్వర్థనారాయణ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు.. మండలంలోని మంగళం పంచాయతీ కంగానెల్లూరుకు చెందిన లక్ష్మన్న కుమారుడు చిన్నరెడ్డెప్ప, గంగులప్పలు అన్నదమ్ములు. ఇద్దరి మధ్య భూ సమస్య ఉండటంతో చిన్నరెడ్డెప్పపై గంగులప్ప దాడి చేశాడు. చిన్నరెడ్డెప్ప ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.